ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 28.01.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళా సీనియర్ ఐఏఎస్ అధికారులు సంక్షేమ వసతి గృహాల్లో రాత్రి బస చేస్తున్నారు.
2. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ నల్లగొండలో ఈరోజు రైతు మహాధర్నా చేపట్టింది.
3. గోండు సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా గిరిజనులు ఘనంగా జరుపుకునే ప్రతిష్టాత్మకమైన నాగోబా జాతర ఈరోజు ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లో ప్రారంభం కానుంది.
4. ఉత్తరాఖండ్ లో 38వ జాతీయ క్రీడలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభిస్తారు.

-----------------------

**రాత్రి బస**

సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన ఆహార పట్టిక ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరి చందన అన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఒకరోజు బస చేయాలన్న ప్రభుత్వ

సూచన మేరకు.. నిన్న రాత్రి నారాయణపేట జిల్లా కేంద్రంలోని సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి సందర్శించారు. విద్యార్థినులతో కలసి భోజనం చేసిన హరిచందన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సంగారెడ్డి జిల్లా  సదాశివపేట మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నిన్న రాత్రి బస చేశారు. వసతి గృహంలోని వంటగది, డైనింగ్ హాల్, వంట సామగ్రి భద్రపరిచే గదిని పరిశీలించారు. వసతి గృహంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి నిన్న రాత్రి భోజనం, ఈ రోజు ఉదయం అల్పాహారం చేసిన అదనపు కలెక్టర్, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**SANGAREDDY, MAHABUBNAGAR  PTC**

------------------------

**రైతు మహాధర్నా**

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ నల్లగొండలో రైతు మహాధర్నా ఈ రోజు నల్లగొండలో కొనసాగుతోంది ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన హామీను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఈ ధర్నా చేపడుతోంది. జిల్లాలోని మాజీ ఎంఎల్ఏ లు, ఎంఎల్సీ లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.. ఈ నెల 21వ తేదీన జరగవలసి ఉన్న ఈ

ధర్నా కార్యక్రమం పోలీసుల అనుమతి నిరాకరణ వల్ల ఆగిపోగా హైకోర్టు అనుమతితో నిర్వహిస్తున్నారు

**పిటిసి, నల్లగొండ జిల్లా**

------------------------

**నాగోబా జాతర**

గోండు సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా గిరిజనులు ఘనంగా జరుపుకునే నాగోబా జాతర ఈరోజు ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లో ప్రారంభం కానుంది. ఈ జాతరను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. ఏటా పుష్య మాసంలో వచ్చే అమావాస్య రోజున మహా పూజలతో మెస్రం వంశస్థులు ఈ జాతరను ప్రారంభిస్తారు. ఈ నెల రెండో తేదీన నెలవంక దర్శనంతో నాగోబా మహాపూజలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 10న పాదయాత్ర చేపట్టి కలమడుగు శివారులోని గోదావరిలోని అస్తినమడుగు నుంచి పవిత్ర గంగాజలం సేకరించారు. పూజలకు నాలుగు రోజుల ముందుగానే ఆలయ పరిసరాల వద్దకు మెస్రం వంశస్థులు చేరుకున్నారు. ఉట్నూరు మండలంలోని శ్యాంపూర్ లోని బుడుందేవ్ కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఈ రోజు అర్ధరాత్రి నుంచి నాగోబా జాతర ప్రారంభమవుతుంది. కాగా నాగోబా జాతర సందర్భంగా గిరిజనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో రెండో అతి పెద్ద జాతర అయిన ఈ ఆదివాసీ వేడుకలో ఆధ్యాత్మిక వెలుగులు నింపే నాగోబా కరుణ అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

**పీటీసీ నిర్మల్**

------------------------

**నిక్షయ్**

క్షయ రహిత భారత దేశం, క్షయ రహిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 100 రోజుల క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాయి. వనపర్తి జిల్లాలో గతేడాది డిసెంబర్ 7 న 100 రోజుల ప్రత్యేక క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఏ.ఐ సాంకేతికత సహాయంతో వ్యాధిని ముందుగానే గుర్తించి, ఉచితంగా చికిత్స అందిస్తారు. జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి ఆకాశవాణితో మాట్లాడుతూ..

--------------**బైట్**--------------

**పీటీసీ, వనపర్తి**

---------------------------

**సుకన్య సమృద్ధి యోజన**

బాలికల భవిష్యత్తుకు భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన పథకం SSY ను ప్రవేశపెట్టింది. బాలికలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు, ఉన్నత విద్య, వివాహ సమయాల్లో తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ దీర్ఘకాలిక పొదుపు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం పై ఖమ్మం జిల్లా మధిరకు చెందిన సత్య సృజిత ఆకాశవాణితో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

---------**బైట్**------------

**PTC, Khammam**

-----------------------

**హైడ్రా**

సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి నగర్లో మాజీ శాసనసభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి నిర్మించిన ప్రహరీని హైడ్రా అధికారులు మరోసారి కూల్చి వేశారు. ప్రభుత్వ భూమి, పక్కనే ఉన్న పార్కును ఆక్రమించుకుని నిర్మించని ప్రహరీ గోడను హైడ్రా అధికారులు మూడు నెలల క్రితం కూల్చి వేశారు. దీనిని రాంభూపాల్ రెడ్డి పునర్నిర్మించడంతో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఈరోజు గోడను పూర్తిగా కూల్చివేశారు.

**SANGAREDDY PTC**

---------------------------

**బోటు ప్రమాదం**

హుస్సేన్ సాగర్లో రెండు రోజుల క్రితం బోటులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఈ రోజు మృతి చెందారు. ఈ నెల 26న భారతమాతకు మహా హారతి కార్యక్రమంలో బాణాసంచా కారణంగా బోటులో అగ్ని ప్రమాదం జరిగింది. అలాగే గల్లంతైన మరో వ్యక్తి కోసం రెస్క్యూ బృందాలు గాలింపు జరుపుతున్నాయి.

**డెస్క్**

-------------------------

**NATIONAL GAMES**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 38వ జాతీయ క్రీడలను ఈనాడు ఉత్తరాఖండ్లో ప్రారంభిస్తారు. ఆ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో ఉన్న మహారాణా ప్రతాప్ స్టేడియంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు గాను కేంద్ర మంత్రులు, భారతీయ ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, క్రీడాకారులు డెహ్రాడూన్ చేరుకున్నారు. డెహ్రాడూన్ చేరుకున్నా ఒలింపింక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషకు ఉత్తరాఖండ్ రాష్ట్ర క్రీడా మంత్రి రేఖా ఆర్య నిన్న విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఈ జాతీయక్రీడలు వచ్చే నెల 14 వరకు కొనసాగుతాయి. రాష్ట్రంలోని 8 జిల్లాల్లో ఉన్న 11 నగరాల్లో ఈ జాతీయ క్రీడలు నిర్వహించాలని ప్రతిపాదించారు. 35 క్రీడల్లో 47 విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడనున్నారు.

**NSD**

------------------------

**బేటీ బచావో – బేటీ పడావో**

కేంద్ర ప్రభుత్వం బాలికల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం గత పదేళ్లుగా విజయవంతంగా అమలవుతోంది. బాలికా విద్యను ప్రోత్సహించడానికి, బాల్యవివాహాలను రూపుమాపేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని కరీంనగర్ జిల్లాలో అమలు చేస్తున్న విధానం గురించి జిల్లా బాలల సంరక్షణ అధికారి పర్వీన్ మా ఆకాశవాణి ప్రతినిధికి వివరిస్తూ....

----------**బైట్**---------

బాలికా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బేటీ బచావో - బేటీ పడావో జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఆసిఫాబాద్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి మా ఆకాశవాణి ప్రతినిధికి వివరిస్తూ...

-----------**బైట్**----------------

**ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లా పిటిసి**

---------------------------

**పరీక్షా పే చర్చా**

రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి అలువాల సాయితేజ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో జరిగే పరీక్ష పే చర్చా కార్యక్రమానికి ఎంపికయ్యారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని తొలగించేందుకు ప్రధాని 'పరీక్ష పే చర్చ' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందుగా నిర్వహించిన అర్హత పరీక్షలో సాయితేజ ప్రతిభ కనబరిచాడు.

**పీటీసీ రాజన్న సిరిసిల్ల**

-------------------------